ఓం నారాయణ - ఆదినారాయణ

# అవధూత లీల

## అధ్యాయము - 28

## నా స్వానుభవాలు (రచయిత)



ఆచార్య శ్రీభరద్వాజగారి సలహానునసరించి శ్రీస్వామివారిని దర్శించి దివ్యమైన అనుభవములను పొంది గత పన్నెండు సం॥రాలుగా శ్రీస్వామివారిని సేవిస్తున్నాను. గత పదిహేను సంవత్సరములుగా శ్రీ శిరిడీ సాయినాథుని చరిత్ర పారాయణ, పూజ చేసుకొనుచున్నాను. దాని ఫలితంగానే నాకు భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారి రూపంలో శ్రీసాయినాథుడు లభించాడు. సాయిలీలామృతం పారాయణ ఫలితంగా శ్రీస్వామివారు ఒక గురుపూర్ణిమకు మా గృహమునకు విచ్చేసి మా ఆతిథ్యమును స్వీకరించి మా స్నేహితుడు టి.వి.శేషగిరిరావు గారింటిలో అఖండనామ సంకీర్తన చేయుచున్న బృందాన్ని ఆశీర్వదించారు. 20 సం॥లుగా నేను ఆయాసంతో బాధపడుతుండేవాణ్ణి. ఎంతటి బాధలోనైనా శ్రీస్వామివారి సన్నిధిలో కూర్చున్న వెంటనే నా బాధనంతా తీసేసినట్లు పోయేది. రెండు పర్యాయములు నేను శ్రీస్వామివారిని దర్శించిన వెంటనే నన్ను ఇంటికి వెళ్ళమని ఆజ్ఞాపించారు. నోరు మెదపకుండా ఇంటికెళ్ళియుంటే నా వ్యాధి ఆనాడే శుభ్రంగా నిర్మూలనమై ఉండేది. వెళ్ళమన్న శ్రీస్వామివారి ఆజ్ఞలను సంపూర్ణముగా ఆచరించకుండా అవసరాన్ని బట్టి నియమభంగం చేసుకోవడం ద్వారా విపరీతమైన అనారోగ్యమునకు గురియై మద్రాసు వెళ్ళి వైద్యం చేయించుకోమని డాక్టర్లు చెప్పడం, శ్రీస్వామివారి సమాధిని దర్శించిన తరువాతనే మద్రాస్ వెళ్ళాలని గొలగమూడి వచ్చేందుకు బస్సు ఎక్కిన లగాయతు సంపూర్ణముగా స్వస్థత చేకూరడం, అది మొదలు శ్రీస్వామివారి సమాధి చెంతనే కాపురముండడం మొ॥ విషయాలు ఈ గ్రంథారంభంలో విపులంగా వ్రాశాను. ఇక్కడ శ్రీస్వామివారు పెట్టిన నియమం వారే నాచేత ఎలా ఆచరింప చేస్తున్నారో చెపుతాను.

శ్రీస్వామివారు నన్ను 'నీ అన్నం నీవు తినయ్యా' అని ఆజ్ఞాపించారు అంటే నా కష్టార్జితం తప్ప వేరేవారి సొమ్ము తినవద్దని, మరియు 'చమురులేకుండా కాల్చు' అని శెలవిచ్చారు అంటే చమురు పదార్థాలు తినవద్దని ఆదేశించారు మరియు శ్రీ సాయినాథుడు ఉప్పు, పులుపు, కారం తినవద్దని ఆదేశించారు. వీటిని నేను చాలావరకు ఆచరిస్తున్నాను. కానీ ప్రసాదమనే పేరుతోను, స్నేహితుల బలవంతంపైన స్వల్పంగా నియమం తప్పడం, తద్వారా రుగ్మతకు లోనవడం గత నాలుగు సంవత్సరముల నుండి జరిగేది. ఈ స్వల్పమైన నియమభంగాన్ని కూడా శ్రీస్వామివారు సహించలేదు. 1985 డిసెంబరు నెలలో ఒకరి గృహప్రవేశానికి వెళ్ళి ప్రసాదమని స్వల్పంగా అరటి పండు తిన్నాను. అంతటితో ఆగక ఆ ఇంటి యజమానురాలు నేనేమీ తినలేదని చిన్నబుచ్చుకుంటుందని సగం అరటి పండు తిని మిగిలిన సగం సంచిలో వేసుకున్నాను. వెంటనే ఎడమకన్ను జిల! నలిపాను వాచిపోయింది. అరటిపండు తినడమే దీనికి కారణమని అనుమానిస్తూ స్కూలుకు చేరాను. ఉదయం 11 గంటలకే విపరీతంగా ఆకలైంది. సంచిలోని మిగిలిన సగం అరటిపండు కూడా తిన్నాను.

వెంటనే కన్ను బాధ జాస్తయింది. నిండా త్రాగిన వానికివలె మైకమై బెంచీ మీద వాలాను. నేను 7 1/2 అడుగుల ఎత్తు తలుపు ముందు రెండు పాదములు ఒకచోట ఉంచి నిలబడి రెండు అరచేతులతో ఆ తలుపును తడుముతూ నొక్కుచున్నాను. ఎచ్చటో ఒకచోట నొక్కితే తలుపు తెరుచుకుంటుంది. ఆ ప్రయత్నంలో కుడికాలు 3 అంగుళాలు ప్రక్కకు జరిపాను. వెంటనే వెనకనున్న సభలోని పెద్దలు "అన్‌ఫిట్ తీసెయ్" అని నన్ను ప్రక్కకు నెట్టేస్తున్నారు. "కాలు కొద్దిగా కదిలిస్తే అది కూడా తప్పేనా" అని వాదిస్తున్నాను. "**చిన్న తప్పయినా తప్పే**" అని ముమ్మారు పలికారు. వెంటనే మెలుకువ వచ్చి సాయంత్రం 6 గం॥లు అయిందని అదిరిపోయి గంట చూశాను. 11 గంటల 10 ని॥ లు మాత్రమే. "ఈ 10 నిముషాలలో ఈ దృశ్యమేమిటా?" అని ఆలోచిస్తే నేను ప్రసాదం అనే పేరుతో నియమభంగం చేస్తే అది చిన్నతప్పయినా ఆధ్యాత్మిక సాధనలో పెద్ద తప్పేనని శ్రీస్వామివారు నాకు దృశ్యంగా చూపించారు అని గ్రహించాను. నాటి నుండి శ్రీస్వామివారి కృప వలన అంతకుముందు సాధ్యముకాని నియమాలు సులభంగా

పాటించగల్గుచున్నాను.

ఆధ్యాత్మిక సాధన దైవరాజ్యంలోకి తలుపులు తెరిచే ప్రయత్నం లాంటిదని, ఆ ప్రయత్నంలో చిన్న తప్పయినా తప్పేనని, అట్టి తప్పు మనలను ఆ సాధనకు అనర్హులను చేస్తుందని శ్రీస్వామివారు బోధించారు.

నాటి నుండి ఎన్నో రోజుల నుండి నిగ్రహించలేని కొన్ని బలహీనతలు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయాయి. తక్కిన బలహీనతలను గూడా ఇదే విధంగా స్వామివారు నిర్మూలించి "మీరు నన్ను వదలినా నేను మిమ్ము వదలను" అని శ్రీస్వామివారిచ్చిన అభయం నిలబెట్టుకుంటారని నా విశ్వాసం. మనవైపు నుండి ఆర్తితో వారిని ప్రార్థించడం, వారి సూక్తులను ఆచరించడం మన కర్తవ్యం. అలాంటి ఆచరణ మనకందరికీ శ్రీస్వామివారు కల్గించాలని ప్రార్థిద్దాము.

శ్రీస్వామివారి ఆజ్ఞమేరకు నేను 1989 సం॥ నవంబర్ వరకు శ్రీస్వామివారి సమాధియొద్దనే కాపురముంటూ, 50 కి.మీ. దూరంలో ఉద్యోగం చేసి ప్రతినిత్యం రాత్రికి వచ్చి శ్రీస్వామివారి సమాధి దర్శనం చేసుకొని వారిని సేవించగలిగాను. 1989సం॥ నవంబర్ మూడవ తేదీ నుండి శ్రీస్వామివారి ఆజ్ఞ మేరకు వాలంటరీ రిటైర్‌మెంట్ ఇచ్చి గొలగమూడిలోనే కాపురముండి శ్రీస్వామివారిని సేవించుకొనుచున్నాను.

నేను (రచయిత) కలిచేడు వదలిపెట్టి శ్రీస్వామివారి సన్నిధిలో కాపురమున్న రోజులు. నాకు గల రెండు సమస్యల గూర్చి శ్రీస్వామివారి సలహా అడగాలనుకున్నాను. కానీ శ్రీస్వామివారితోను, శ్రీసాయితోను నాకు గల అనుభవం దృష్ట్యా శ్రీస్వామివారెప్పుడూ తమ మాటను సంకేత రూపంలో చెపుతారని, ఆ సంకేతాలు అర్థమవడం కష్టమని, కానీ శ్రీసాయి తన మాటను స్పష్టమైన మాటల్లో తెలియజేస్తారని తలచాను. గనుక నా సమస్యలను గూర్చి సమాధానం, సలహా కోరుచూ శిరిడీ వెళ్ళి ఒకవారం రోజులు దీక్ష చేశాను. అచ్చట శ్రీసాయినాథుడు కూడా నా సమస్యలకు శ్రీస్వామివారివలె సంకేత రూపములోనే సమాధానాలిచ్చి 'పిచ్చి వాడా నాకు, స్వామికి భేదం లేదు. నీవక్కడే శ్రీస్వామివారిని మనస్ఫూర్తిగా, మాకిద్దరికీ భేదభావం లేకుండా ఆరాధించమ'ని ఆత్మబోధ చేశారు. గనుక తత్త్వతః ఈ మహనీయులిద్దరికీ

ఎలాంటి బేధం లేదు. అంతే గాదు వీరిద్దరికీ ఎంతో గాఢమైన అనుబంధమున్నదని నా నమ్మకము.

ఇంతేగాక – శ్రీ సాయి తన నాశ్రయించిన వారికి వారి నడవడిలోని దోషాలు చూపించి వారి ప్రవర్తన సరిచేసేవారని – శ్రీస్వామి ఎల్లప్పుడూ మౌనంగా ఉంటారుగానీ శ్రీ సాయివలె మన దోషాలను వేలెత్తి చూపరని తలచేవాణ్ణి. రెండవది శ్రీస్వామివారు సశరీరంగా లేరు గనుక మన దోషాలను చూపి దండించే దిక్కులేదని తలచేవాణ్ణి.

కానీ 1988 మే నెలలో పదునైదు రోజులు శ్రీస్వామివారి సమాధికి పూజ చేసే భాగ్యం గల్గింది. ఈ కొద్ది కాలంలో శ్రీస్వామివారు సర్వకాల సర్వావస్థల యందు మనలను వెన్నంటి ఉంటారని, మన దోషాలను వాచా చెప్పే కంటే ఆత్మబోధ ద్వారా నిరంతరం పలుకుతుంటారని, మన దోషాలకు వెంటనే శిక్ష కూడా వేస్తారని తెలుసుకున్నాను. నాడే గాదు నేడు గూడా మనలో ఎలాంటి మలిన వాసనలు తలెత్తినా, పరదూషణ, అసత్యమాడుట, మనసులో అహంకరించుట వంటి దుర్గుణాలు తలెత్తినా వెంటనే తగువిధంగా హెచ్చరిస్తారు. అలాంటి దుర్గుణాలు తలెత్తినప్పుడు సాంబ్రాణి వేసేందుకు అనువైన నిప్పు దొరకదు. శ్రమపడి నిప్పు తెచ్చే లోపల పూజ టైం దాటిపోతుంది. ఒక్కొక్కప్పుడు పూజ చివర ధూపమేసేందుకు నిప్పు చూసుకుంటే ఆరిపోయి ఉంటుంది. మరొకప్పుడు పూజలో మరొక లోపం జరుగుతుంది. ఏమి స్వామీ ఇలా చేశారే అని అనుకుంటే 'ఇందాకటి నీ అహంకారానికిది శిక్ష' అని తెల్పుతారు. నేటికీ శ్రీస్వామివారు మన సేవను నిరాకరించడం ద్వారా మనలను హెచ్చరిస్తుంటారు. అలాంటి దుర్గుణాలు తలెత్తకుండా కాపాడమని శ్రీస్వామివారిని సదా ప్రార్థిస్తుంటాను.

శ్రీ శిరిడీ సాయిబాబా చరిత్ర చదివాక వారిలాగ శ్రీవెంకయ్యస్వామివారు ఖండయోగం చేసినట్లు సాక్ష్యాధారాలు లేవుగదా – అనే కొరత నన్ను చాలా కాలంగా పీడిస్తుండేది. కరుణామయుడైన శ్రీస్వామివారా కొరతను నేటికి తీర్చారు.

షేక్ రహంతుల్లా – ఓగూరు ప్రక్కన గల వాకమడ గ్రామం, బ్రాహ్మణపల్లి మండలం, కడప జిల్లావారు శ్రీస్వామివారితో తనకు గల

అనుభవాలనిలా వివరించారు.

నా కుడికాలు మోకాళ్ళ క్రింద నుండి ఎముకలలో చాలా తీవ్రమైన నొప్పి వుండేది. ఆనాటి నాటువైద్యులు, ఇంగ్లీషు వైద్యులు లెక్కలేనంత మంది వైద్యం చేసి వేలరూపాయలు ఖర్చయినవే తప్ప నా బాధను ఏ మాత్రమూ తగ్గించలేకపోయారు. నా స్నేహితుల ద్వారా శ్రీస్వామివారిని గూర్చి విని చివరి ఆశగా పెన్నబద్వేలు తిప్పపైన వేంచేసియున్న శ్రీస్వామివారిని దర్శించాను. తన అమృతహస్తంతో నాకాలు కొంచెంసేపు సరదీసినట్లు రుద్దారు. మొదటి రోజే కొంత నొప్పి తగ్గింది. ఇరవై రోజులపాటు శ్రీస్వామివారు నిత్యం నాకాలును ఈ విధంగా కొంతసేపు రుద్దేవారు. చివరికానొప్పి ఏ మందూ మాకు లేకుండానే పూర్తిగా పోయింది. నాకు క్రొత్త జీవితాన్ని ప్రసాదించిన ఆ కరుణామయునకు నేనేమి చేసినా ఋణం తీరదు.

ఆనాడు శ్రీస్వామివారుండే ఆ చోట్లో కరెంటు లైట్లు లేవు. రాత్రి ఒంటేలుకు లేచిన నేను జాజ్వల్యమానంగా వెలుగుచున్న అగ్నిగుండము వెలుగులో ఆ గుండముచుట్టూ ఉన్న దృశ్యం చూచి భయభ్రాంతుడనయ్యాను. శ్రీస్వామివారి అవయవాలన్నీ ముక్కలు ముక్కలుగా ఛేదింపబడి, కాళ్ళొకచోట, చేతులొకచోట, తల, మొండెము ఇట్లే అన్ని అవయవాలు తలా ఒక దిక్కున నేలపై పడియున్నాయి. ఆ దృశ్యం చూచిన నేను భయకంపితుడనై సమీప మందలి పూరిపాకలోకి పరుగెత్తాను. అక్కడ శ్రీస్వామివారు లేరు. తర్వాత పదినిమిషాలకు శ్రీస్వామివారు మామూలుగానే అగ్నిగుండము దగ్గర కూర్చొని దర్శనమిచ్చారు. ఒక అరగంట తర్వాత శ్రీస్వామివారు పూరిపాకలోని నా దగ్గరకొచ్చి "ఏమయ్యో రంతు సాయిబా! నీకు లోకం కనబడింది గదయ్యా. ప్రొద్దున్నే నీవు మీ గ్రామం వెళ్ళిపోవాలి. ఇక్కడ ఉండకూడదు" అని పదే పదే చెపుతూ చార్జీలకు నాచేతికి డబ్బులిచ్చి, 'నాలుగు రోజుల వరకు నీవిక్కడ ఉండకూడదు.' అని తొందర పెట్టి నన్ను మా గ్రామం పంపేశారు. నేను చూచిన ఖండయోగ దృశ్యం గురించి నేనందరికీ చెపుతాననే శ్రీస్వామివారలా నన్ను పంపేశారు.

ఐదవరోజు నేను శ్రీస్వామివారి చెంతకొచ్చి నిద్రచేశాను. తెల్లవారుతూనే 'అయ్యా రంతుసాయిబా! మీ తమ్ముని చెయ్యి విరిగింది.

కట్టు కట్టినారు, అదేమీ చేయదులే పోయ్యా' అని నన్ను మా గ్రామం పంపేశారు. నేను మా గ్రామం వెళ్ళి విచారిస్తే శ్రీస్వామివారి మాట అక్షరాలా నిజమైంది. మా తమ్ముడు మేకలకు ఆకు కోసేందుకు చెట్టెక్కి పడి చెయ్యి విరిగినందున కట్టు కట్టియున్నారు. శ్రీస్వామివారి ఆశీస్సుల ప్రకారం కొద్దిరోజులలో ఏ వైద్యాలూ లేకుండానే విరిగిన చెయ్యి చక్కగా కట్టుకున్నది.

**<u>అవధూత శ్రీ వెంకయ్యస్వామి వారిలో నేను దర్శించిన సత్యాలు (రచయిత) :</u>**

శ్రీస్వామివారు తలుపూరులో ఉన్నారు. శ్రీవారు విడిది చేసిన చోట ఆనాడు విద్యుత్ లైట్లు లేక లాంతరు ఒక గుంజకు తగిలించియున్నారు. రాత్రి పది గంటలప్పుడు శ్రీస్వామివారు 'అయ్యా ఇది రాత్రా, పగలా?' అని అడిగారు. 'స్వామీ! లాంతరు అంత బాగా వెలుగుతుంది కదా. పగలా రాత్రా అని అడుగుతారేమిటి?' అని సేవకులు నవ్వుతున్నారు.

మరొకరోజు శ్రీస్వామివారు 'అయ్యా ఇదేఊరు?' అనడిగారు. అది సాయం సమయము. 'స్వామీ మీకిదే ఊరైంది కూడా తెలియడం లేదా, ఇది తలుపూరు గదా స్వామీ' అని అందరూ నవ్వుకున్నారు. అంటే శ్రీస్వామివారు రాత్రి, పగలూ అనే భేదంగానీ, ఏగ్రామమైనది పరిసరాలను బట్టి తెలుసుకునే స్థితిలో లేరన్నమాట.


ఇదే విధంగా శ్రీ రామకృష్ణ పరమహంసగారు కూడా 'ఈనాడు పున్నమా? అమావాస్యా?' అని అడుగుతారు. అవధూతస్థితిని తెలియని అమాయక సేవకులు నవ్వుకుంటారు.

ఒకరోజొక సేవకుడు కోపమెట్లా పోతుంది స్వామీ? అని అడిగితే శ్రీస్వామివారు 'రాత్రి, పగలు భేదం తెలియకుండాపోతే కోపం పోతుంది' అని అన్నారు. రాత్రి, పగలు భేదం తెలియకుండా పోవాలంటే ఏమి చేయాలో ఆ సేవకుడు అడుగలేదు.

అది మండు వేసవి. ఏప్రిల్ నెల. శ్రీస్వామివారు తలుపూరులో మస్తానయ్య గారింట్లో విడిది చేసియున్నారు. మస్తానయ్యగారిల్లు ఊరికి తూర్పు చివర ఉంది. ఆ ఇంటి ముందు చిన్న చిన్న కర్రతుమ్మ చెట్లు తప్ప వేరే ఏ నీడా, చెట్లూ లేవు. శ్రీస్వామివారు అక్కడొకచోట అగ్నిహోత్రమేసుకొని

కూర్చొనియున్నారు. మధ్యాహ్నం రెండు గంటల వేళలో నేను, నామిత్రుడు శ్రీ టి.వి. శేషగిరిరావుగారు శ్రీస్వామివారి దర్శనార్థం వెళ్ళాము. ఒక పది నిముషాల్లో నా రబ్బరు చెప్పులు వేడెక్కి నేను చెప్పుల మీద నిలువలేకున్నాను. శేషగిరిరావుగారు దూరానున్న వేప చెట్టు క్రిందకు వెళ్ళారు. నేను కంపతుమ్మ మండల కొనలు నా చెప్పుల క్రింద వేసి అలాగే చూస్తూ కూర్చున్నాను.

తూర్పు ముఖంగా ఉన్న శ్రీస్వామివారు అగ్నిని ప్రజ్వలింపజేస్తూ పంగాల కంపతో కట్టెలు ఎగదోస్తూ అగ్నికి సమీపంలోనేయున్నారు. వారి శరీరంపై కౌపీనం (గోచి) తప్ప మరెలాంటి ఆచ్ఛాదనా లేదు. శరీరమంతా చెమటలు కక్కుతుంది. వళ్ళంతా మసిమరకలు, ముఖమంతా వికారంగా మసి, విభూతితో నిండి ఉంది. కానీ శ్రీవారు అగ్ని ప్రేలుస్తూ తలమీద కనీసం దట్టంగా వెంట్రుకలు కూడా లేకుండా అగ్ని సమీపంలోనే కూర్చొనియున్నారు. నేనెంతో దూరంలో కాళ్ళకు చెప్పులు, చెప్పుల క్రింద కంపతుమ్మ మండలు, నాతలపై చేతి గుడ్డ, వంటి నిండా దుస్తులు ఉన్నా ఆ ఎండ తీవ్రతను తట్టుకోలేకున్నాను. మరి శ్రీస్వామివారు ఆ ప్రజ్వలించే అగ్నికి ఎంతో దగ్గరలోనే కూర్చొని ఎలా ఉండగలుగుచున్నారు అన్నదే నా ప్రశ్నగా ఆశ్చర్యంతో గంటల తరబడి చూస్తూ ఉండిపోయాను. ఆనాడు అది అవధూత స్థితియని, అలా వారుండగలగడమే వారి గొప్పతనమని నాకు తెలియలేదు.



శ్రీ స్వామి వారి వేలి ముద్రలు